క్లుప్తంగా

గెలుపు, ఓటములు సహజం

దమ్మపేట: క్రీడా పోటీల్లో గెలుపు, ఓటములు సహజమేనని, క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవడమే ముఖ్యమని స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని పట్వారిగూడెం గ్రామంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ విజేతలకు మొదటి బహుమతిగా రూ.15,000ల నగదుతో పాటుగా షీల్డ్‌ను ఎమ్మెల్యే చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడాకారులు గెలుపు, ఓటములను దృష్టిలో పెట్టుకోకుండా, క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని అన్నారు. అశ్వారావుపేట నియోజకవర్గ అభివృద్ధికి, మన రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ తెలంగాణ పార్టీ జిల్లా అధ్యక్షుడు సోయం వీరభద్రం, బీఆర్ఎస్ మండల నాయకులు దొడ్డాకుల రాజేశ్వరరావు, కొయ్యల అచ్యుతరావు, సర్పంచ్ మొగిలి అంజలి, ఉపసర్పంచ్ రెడ్డిమళ్ల నాగయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలి

భద్రాచలంఅర్బన్: గిరిజన హాస్టల్ కార్మికుల వేతనాలు చెల్లించాలని కోరుతూ గురువారం స్థానిక ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షుడు, డీసీసీ జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్యకు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. క్యాంప్ కార్యాలయం ఎదుట ఖాళీ కంచాలతో నిరసన వ్యక్తం చేసి అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. పోస్టు మెట్రిక్ హాస్టళ్లలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులకు నెలల తరబడి జీతాలు బకాయి ఉందని, వాటిని తక్షణమే చెల్లించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు బ్రహ్మచారి డిమాండ్ చేశారు.

ఆర్థిక మంత్రి, ప్రధాన కార్యదర్శికి లేఖరాస్తా..

హాస్టల్ కార్మికుల వేతనాలు చెల్లించాలని ఆర్థిక శాఖలో ప్రభుత్వం పెట్టిన ఆంక్షలు తొలగించాలని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావుకు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాస్తానని ఎమ్మెల్యే పొదెం వీరయ్య కార్మికులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మికులతో పాటు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

వామపక్షాల ర్యాలీ

అశ్వారావుపేటరూరల్: వామపక్షాల ఆధ్వర్యంలో గురువారం అశ్వారావుపేటలో రైతు వాహన ర్యాలీ కార్యక్రమాన్ని చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ స్థానిక రింగ్ రోడ్ సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ చేసి, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం జరిగిన వామపక్షాల సమావేశంలో రైతులకు జరుగుతున్న నష్టాల గురించి, ప్రభుత్వ తీరుపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, సీపీఎం పార్టీల నాయకులు గన్నిన రామకృష్ణ, గోగినపల్లి ప్రభాకర్, కొక్కెరపాటి పుల్లయ్య, చిరంజీవి, పిట్టల అర్జున్, ఎస్కే రఫీ, వాసం బుచ్చిరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

బీఎస్పీ సంతకాల సేకరణ

మణుగూరురూరల్: బీసీల కుల గణన చేసి రిజర్వేషన్లను పెంచాలని డిమాండ్ చేస్తూ బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమం గురువారం మూడో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా బీఎస్పీ నాయకులు మాట్లాడుతూ.. బీఎస్పీ రాష్ట్ర చీఫ్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నేతృత్వంలో కోటి సంతకాల సేకరణను మూడు రోజులుగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వాలు స్పందించి బీసీల రిజర్వేషన్లను 52 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

'తెల్లం' జన్మదిన వేడుకలు

దుమ్ముగూడెం: బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తెల్లం వెంకట్రావు జన్మదిన వేడుకలను గురువారం లక్ష్మీనగరంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. వెంకట్రావు త్వరగా కోలుకుని పూర్తి ఆరోగ్యంతో పేదప్రజలకు అందుబాటులో ఉండాలని కోరుకుంటూ కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచుకుని సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కణితి రాముడు, అలీంఖాన్, జానీపాషా, సర్పంచ్ మట్టా వెంకటేశ్వరరావు, వాగే వెంకటేశ్వరరావు, జుంజూరి జయసింహ, మోతుక్కురి శ్రీకాంత్, పాడుతూరి నాగరాజు, దామర్ల శ్రీనివాస్, తోట రమేష్, లంక శివ, అల్లాడి వెంకటేష్, కొత్తూరి సీతారామారావు, పోడియం సుబ్బారావు, అయ్యపురెడ్డి శ్రీధర్, జిలకర గంగరాజు, డింగి కన్న, పాడకలపల్లి శ్రీను, పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భూమి పూజ

అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని పెద్దిరెడ్డిగూడెం పంచాయతీలో నూతన సీసీ రోడ్ల నిర్మాణానికి ఎంపీపీ సున్నం లలిత గురువారం భూమి పూజ చేశారు. ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎంపీపీ నిధులు రూ.10 లక్షలతో శాంతి నగర్ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు బోయినపల్లి సుధాకర్, వైస్ ఎంపీపీ మామిళ్లపల్లి రామారావు, సర్పంచ్ సున్నం బసవయ్య, ఎంపీటీసీలు కాక సీత తదితరులు పాల్గొన్నారు.

నింగికెగిసిన రాజ్యాంగ స్ఫూర్తి


అశ్వారావుపేటరూరల్: క్యాంప్ ఆఫీస్ వద్ద జెండా ఎగురవేసిన ఎమ్మెల్యే నాగేశ్వరరావు


చర్ల: నృత్యాన్ని ప్రదర్శిస్తున్న పాఠశాల విద్యార్థులు

గణతంత్ర దినోత్సవాన్ని గురువారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్, పంచాయతీ కార్యాలయాలు, పాఠశాలలో జాతీయ జెండాను ఎగురవేసి, సంబురాలు జరుపుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయాశాఖల మండల అధికారులు, జీపీ ఆఫీసుల్లో పంచాయతీ కార్యదర్శులు, బ్యాంకుల్లో మేనేజర్లు, పాఠశాలల్లో హెచ్ఎంలు మువ్వెన్నెల జెండాను ఆవిష్కరించారు. రాజకీయ పార్టీల కార్యాలయాల్లోనూ నిర్వహించారు. పాఠశాలల్లో విద్యార్థులు భారతమాత, గాంధీజీ తదితర వేషధారణలో.. మూడు రంగుల జెండాతో ర్యాలీలు నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. వక్తలు మాట్లాడుతూ.. స్వాతంత్ర్య అనంతరం రాజ్యాంగ అమలు గురించి వివరించారు. కార్యక్రమాల్లో ఆయా ప్రాంతాల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

– సాక్షినెట్‌వర్క్


భద్రాచలంఅర్బన్: జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న ఏఎస్పీ రోహిత్‌రాజ్


అశ్వాపురం: జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ సురేష్‌కుమార్


దమ్మపేట: మూడు రంగుల భారీ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


కరకగూడెం: జెండాకు సెల్యూట్ చేస్తున్న డీటీ సంధ్య


చండ్రుగొండ: జెండావిష్కరణ చేస్తున్న తహసీల్దార్ రవికుమార్


అన్నపురెడ్డిపల్లి: తహసీల్దార్ భద్రకాళి ఆధ్వర్యంలో..


భద్రాచలం: లిటిల్‌ఫ్లవర్స్ విద్యాలయంలో జెండా వందనం చేస్తున్న డైరెక్టర్లు, ఉపాధ్యాయులు


చర్ల: తహసీల్దార్ భరణిబాబు ఆధ్వర్యంలో..


గుండాల: జెండా వందనం చేస్తున్న గుండాల తహసీల్దార్ నాగదివ్య


దుమ్ముగూడెం: జెండాకు వందనం చేస్తున్న తహసీల్దార్ చంద్రశేఖర్


పినపాక: మండల పరిషత్ కార్యాలయంలో జెండా ఎగరవేస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు


గుండాల: వివిధ రకాల వేషధారణలో విద్యార్థులు, ఉపాధ్యాయుడు


మణుగూరుటౌన్: బీటీపీఎస్‌లో సీఈ బిచ్చన్న ఆధ్వర్యంలో..



మణుగూరుటౌన్: సింగరేణిలో చిన్నారుల నృత్య ప్రదర్శనలు..


ములకలపల్లి: జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ వీరభద్రం


అశ్వారావుపేటరూరల్: జాతీయ పతాక వర్ణంలో విద్యార్థులు


మణుగూరురూరల్: జెండా ఆవిష్కరిస్తున్న డీఎస్పీ రాఘవేంద్రరావు

బీఆర్ఎస్ గెలుపే లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేగా కాంతారావు

మణుగూరుటౌన్: బీఆర్ఎస్ గెలుపుకోసం ప్రతి కార్యకర్తా సైనికుల్లా పనిచేయాలని, పార్టీ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని తెలంగాణ ప్రభుత్వ విప్, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం మణుగూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పార్టీ నియోజకవర్గ కార్యకర్తల విస్తృత సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. 2023లో జరిగే ఎన్నికలే ప్రధాన ఎజెండాగా తీసుకుని పార్టీ బలోపేతానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లే దిశా నిర్దేశం చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలు కిందిస్థాయి ప్రజలకు వివరించి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పినపాక నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దామన్నారు. అన్ని గ్రామాల్లో సైడ్ కాలువలు, సీసీరోడ్ల నిర్మాణం వంటి పనులు పూర్తిచేస్తామని భరోసానిచ్చారు. త్వరలో దేశ రాజకీయాల్లో సీఎం కేసీఆర్ క్రియాశీలక పాత్ర పోషిస్తారన్నారు. దేశానికి వెన్నముకైన రైతు వెన్నువిరుస్తున్న బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మణుగూరు, పినపాక, అశ్వాపురం, బూర్గంపాడు, గుండాల, ఆళ్లపల్లి, కరకగూడెం మండలాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి సర్పంచ్‌కు సన్మానం

ములకలపల్లి: ములకలపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ బీబినేని వీరభద్రం టీడీపీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. యూనిసెఫ్ ఆధ్వర్యంలో ఎన్ఐఆర్‌డీ (నేషనల్ ఇన్సిస్ట్యూట్ ఆఫ్ రూరల్ డవలప్‌మెంట్) హైదరాబాద్ నేతృత్వంలో 25వ జాతీయసదస్సు నిర్వహించగా.. తెలంగాణాతోపాటు, ఆంధ్రప్రదేశ్, సిక్కిం, అస్సాం రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సదస్సులో తెలంగాణా రాష్ట్రం నుంచి ములకలపల్లి సర్పంచ్ వీరభద్రంకు చోటు దక్కింది. సదస్సులో పాల్గొన్న సర్పంచ్ వీరభద్రం బాలసభ, మహిళాసభల అనుభవాలను వివరించారు. కాగా జాతీయస్థాయి సదస్సులో స్థానిక సర్పంచ్ పాల్గొనడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, టీడీపీ మండల అధ్యక్షుడు తేళ్ల చెన్నయ్య గురువారం సర్పంచ్ దంపతులను దుశ్శాలువతో సత్కరించారు. అదేవిధంగా ఎంపీపీ


సర్పంచ్ వీరభద్రం దంపతులకు సత్కారం..

లక్ష్మయ్య, సెక్రటరీ అశోక్‌లను సైతం సత్కరించారు. ఎంపీటీసీలు తాటి తులసి, సున్నం సునిత, సొసైటీ మాజీ అధ్యక్షుడు కరుటూరి కృష్ణ, చల్లా వెంకటేశ్వర్లు గుమ్మడి దేవస్వామి తదితరులు పాల్గొన్నారు. కాగా జీపీ వర్కర్స్ ఆధ్వర్యంలో సర్పంచ్ వీరభద్రం దంపతులను, ఎంపీఓ లక్ష్మయ్య, కార్యదర్శి అశోక్‌లను శాలువాకప్పి సత్కరించారు.

వాలీబాల్ కిట్లు పంపిణీ


వాలీబాల్ కిట్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పాయం, ఎంపీపీ సుజాత

అశ్వాపురం: మారుమూల గ్రామాల క్రీడాకారులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పినపాక నియోజకవర్గ యువతకు వాలీబాల్ కిట్లు అందజేయాలని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కోరడంతో పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నియోజకవర్గ యువకులకు 300 కిట్లు అందించారు. అశ్వాపురం మండలంలో 30 జట్ల క్రీడాకారులకు గురువారం మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఎంపీపీ ముత్తినేని సుజాత చేతుల మీదుగా వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కిట్లు అందజేసిన పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యుడు ఎస్‌కే.ఖదీర్, నాయకులు ముత్తినేని వాసు, ఓరుగంటి రమేష్, పాయం సర్వేశ్వరరావు, గొల్లపల్లి నరేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆర్థిక చేయూత

బూర్గంపాడు: సోంపల్లి గ్రామానికి చెందిన కనకం భవాని ఎముకల సంబంధిత వ్యాధితో బాధపడుతూ.. మంచానికే పరిమితమైంది. ఆమె వైద్యఖర్చులకు మోరంపల్లి బంజరకు చెందిన చేయూత ట్రస్ట్ గురువారం రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కైపు లక్ష్మీనారాయణరెడ్డి, జక్కిరెడ్డి మల్లారెడ్డి, పుట్టి రాజేష్, కైపు రామచంద్రారెడ్డి, వేముల సురేష్, శెనగ మల్లేష్, గంటా మస్తాన్‌బాబు, హనీఫ్, మూల లక్ష్మీరెడ్డి, కామిరెడ్డి వెంకటరెడ్డి, అనిత పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

భద్రాచలంటౌన్: పట్టణంలోని బ్రేస్ అనాథల పిల్లల పాఠశాల, సరోజమ్మ వృద్ధాశ్రమంలో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్ర బృందం ఆధ్వర్యంలో గురువారం నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చాక్లెట్లు, స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్రేస్ స్కూల్, వృద్ధాశ్రమం నిర్వాహకులు, రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్ర బృందం సభ్యులు పాల్గొన్నారు.

నూతన కార్ల ఆవిష్కరణ

మణుగూరుటౌన్: మణుగూరు మండలంలోని ప్రముఖ కార్లకంపెనీ హుండాయ్ షోరూం పాయింట్‌లో గురువారం ఆ కంపెనీకి చెందిన నూతన కార్లు గ్రాండ్ ఐ10 నియోస్, హౌరా కొత్త వర్షన్లను మణుగూరు ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ భూక్యా రాములు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హుండాయ్ షోరూం మేనేజర్ అశోక్‌కుమార్ మాట్లాడారు. నియోస్ ఎక్స్ షోరూమ్ ధర రూ5.68లక్షలు, హౌరా ధర రూ6.29లక్షలుగా ఉందన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ రమేష్, ప్రముఖ వైద్యులు బుడగం రామకృష్ణ, స్థానిక షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

రామయ్య దర్శనానికి రండి

బూర్గంపాడు: భద్రాద్రి రామయ్య దర్శనానికి రమ్మని ఒంగోలు పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసులరెడ్డిని భద్రాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యుడు యడమకంటి రోశిరెడ్డి ఆహ్వానించారు. గురువారం ఒంగోలులో మాగుంటను కలిసి భద్రాద్రి రామయ్య శేష వస్త్రాలు, ప్రసాదాలను అందించారు. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించుకున్నారు.

వసంత పంచమి వేడుకలు

భద్రాచలంటౌన్: వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం పట్టణంలోని భక్తులు భక్తిశ్రద్ధలతో వేడుకలను నిర్వహించారు. సరస్వతి దేవి జన్మదినమైన వసంత పంచమి సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. చిన్నారులకు తల్లిదండ్రులు అక్షరాభాసం చేయించారు. అంతా శుభమే కలగాలని సరస్వతి దేవిని కోరుకున్నారు.

సమస్యలపై దృష్టి సారించాలి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం నియోజకవర్గ సమస్యలపై అధికార, ప్రతిపక్ష పార్టీలు దృష్టి పెట్టి కృషి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు కోరారు. సీపీఎం పట్టణ కార్యదర్శివర్గ సమావేశం ఎంబీ నర్సారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పోతినేని సుదర్శన్ రావు మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో భద్రాచలం పట్టణం ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని అధికారులు, ఇంజనీర్ల సర్వేలు చెబుతున్నాయని, ఈ సమస్యపై కేంద్ర ప్రభుత్వమే రెండు రాష్ట్ర ప్రభుత్వాలను కూర్చోబెట్టి పరిష్కరించాలన్నారు. ఆంధ్ర ప్రాంతంలోని నెల్లిపాక నుంచి తెలంగాణ ప్రాంతంలోని లక్ష్మీనగరం వరకు గోదావరికి ఇరువైపులా కరకట్టను నిర్మించే విధంగా కృషి చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు,


సమావేశంలో మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్

ఏజే రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి గడ్డంస్వామి, జిల్లా కమిటీ సభ్యులు ఎం.రేణుక, సున్నం గంగా, పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు బి.వెంకటరెడ్డి, బండారు శరత్ బాబు, వై.వెంకట రామారావు, పి.సంతోష్ కుమార్, ఎన్.లీలావతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ పథకాలపై కళాజాతా

అశ్వారావుపేటరూరల్: టీఎస్ ఆర్టీసీ అమలు చేస్తున్న పథకాలపై గురువారం కళాజాతా ద్వారా అవగాహన కల్పించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో సత్తుపల్లి ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ఈ కళాజాతాను నిర్వహించగా, కళాకారులు ఆట, పాటలతో వివరించారు. అదే విధంగా ఆర్టీసీ కల్పించే రాయితీలు, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించడం వల్ల కలిగే ఉపయోగాల గురించి వివరించారు. కార్యక్రమంలో కళాకారులు సాంబయ్య, శ్రీనివాస్, రమేష్, శంకర్, ఎల్లస్వామి, కంట్రోలర్ నార్లపాటి సునీత, రిటైర్డ్ ఉపాధ్యాయులు ప్రకాశ్‌రావు పాల్గొన్నారు.

ఖాజీ కార్యాలయం ప్రారంభం


ఖాజీగా నియమితులైన షబ్బీర్‌హుసేన్‌ను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

చండ్రుగొండ: మండలకేంద్రం చండ్రుగొండలో గురువారం ప్రభుత్వ ఖాజీ కార్యాలయాన్ని జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు ఎస్డీ రసూల్ ప్రారంభించారు. ఇటీవల యండి.షబ్బీర్‌హుసేన్‌ను ప్రభుత్వం ఖాజీగా నియమించిన విషయం విదితమే. ఈ క్రమంలో కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. తొలుత కార్యాలయం ఎదుట గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఖాజీగా నియమితులైన షబ్బీర్‌హుసేన్‌ను సన్మానించారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు దార వెంకటేశ్వరరావు, మెడా మోహన్‌రావు, భూపతి శ్రీనివాసరావు, యండి.సాబీర్‌హుసేన్, నల్లమోతు వెంకటనారాయణ, యండి.ఖాజాహుసేన్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించాలి

దుమ్ముగూడెం: మండలంలో పంటలు చేతికందే సమయంలో సరైన సమయానికి విద్యుత్ సరఫరా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వీరికి నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని కోరుతూ నర్సాపురం రైతులు ట్రాన్స్‌కో ఏఈకి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. మండలంలో ప్రధానంగా వ్యవసాయం మీద ఆధారపడే కుటుంబాలు ఎక్కువగా ఉన్నాయని, ఈ నేపథ్యంలో సరైన సమయానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం వల్ల నీరు అందక సాగు చేస్తున్న పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని అన్నారు. 24 గంటలు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాల్సిన బాధ్యత విద్యుత్ అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో రైతులు అన్నే శ్రీనివాసరావు, వీరమాచినేని సునీల్, కొడాలి లోకేష్, నరసింహాచారి, రావులపల్లి పృథ్వీ, ముళ్ళపూడి గంగాధర్, కొల్లి శ్రీను, కొల్లి కాంతారావు, బొల్లోజు రవి, సూది రెడ్డి దేవదాస్ రెడ్డి, అనిల్, సింహాద్రి రాజేష్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

వెండి కిరీటం వితరణ


వెండి కిరీటాన్ని అందజేస్తున్న భూషమ్మ

ములకలపల్లి: మండల కేంద్రంలోని షిర్డీసాయి బాబా ఆలయానికి మాధారంకు చెందిన బోడపట్ల భూషమ్మ వెండి కిరీటాన్ని విరాళంగా అందజేశారు. సుమారు రూ.60 వేల విలువ గల కిరీటాన్ని గురువారం ఆమె ఆలయ కమిటీ బాధ్యులకు అందజేశారు.